క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జాన్సన్ నాయక్

జన్నారం: కష్టపడి పండించిన ధాన్యం వర్షాలకు తడిసిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయానికి వడ్లు కొనకపోవడంతోనే ధాన్యం వాన పాలైందని, ప్రభుత్వం, అధికారులు మేల్కొని, కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు గంగాధర్, ఫజల్‌ఖాన్, మున్వర్ అలీఖాన్, సత్యం, నర్సగౌడ్, సంతోష్‌కుమార్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



రోగులతో వైద్యాధికారులు

చెన్నూర్: చెన్నూర్‌లో బండారి రాజేశ్వరి చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మూడు మండలాలకు చెందిన 20మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యులు అభిషేక్ చిందం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ బుధవారం చెన్నూర్‌లో రాజేశ్వరి చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వరి చారిట్రబుల్ ట్రస్ట్ ఫౌండర్ బండారి లక్ష్మణ్, వైద్య బృందం పాల్గొన్నారు.

‘అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు’



తనిఖీ చేస్తున్న ఏసీపీ, సీఐలు

చెన్నూర్: అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. మావోయిస్టుల బంద్ పిలుపులో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంతో పాటు లాడ్జీలు, వాహనాలు, ప్రయాణికులను తనిఖీ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలను లాడ్జీలలో నమోదు చేయాలని సూచించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు తైక్వాండో కరాటే పోటీల్లో సత్తాచాటారు. ఈ నెల 8న లక్సెట్టిపేటలో నాలుగో రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో కటాస్ విభాగాల్లో కోట లక్ష్మీ, నిహారిక, పులగం నందిత, కామని నక్షత్ర దీపిక, స్పైరింగ్ పోటీల్లో సార్ల మోక్షిత్ బంగారుపతకాలు, కస్తూరి శివచరణ్ రజత, గంధశ్రీ విశ్వక్ బంగారు పతకాలు గెలుపొందారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్ సురభి శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ సరోజిని, కరాటే మాస్టర్ రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముందస్తు అరెస్ట్



కోటపల్లి/జన్నారం/చెన్నూర్/మంచిర్యాల రూరల్(హాజీపూర్)/నెన్నెల/కాసిపేట: మాజీ సర్పంచులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో అసెంబ్లీ ముట్టడికి సర్పంచుల సంఘం పిలుపునిచ్చింది. దీంతో ఆయా మండలాల్లోని మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.



మొదళ్ల వరకు మొక్కలను నరికేసిన మున్సిపల్ అధికారులు

కోనో ముప్పు..!

- మంచిర్యాలలో ఏపుగా పెరిగిన హానికర మొక్కలు
- మొదళ్ల వరకు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు
- శాశ్వతంగా నిర్మూలించాలని ప్రజల డిమాండ్
- ఇతర మొక్కలు నాటాలని విన్నపం



ఏపుగా పెరిగిన కోనో కార్పస్ మొక్కలు

మంచిర్యాలటౌన్: పచ్చదనం కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయనే వృక్షోరక్షితి రక్షితః అంటుంటారు. కానీ హరితహారంలో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో గత కొన్నేళ్ల క్రితం నాటిన కోనో కార్పస్ మొక్కలు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెనుప్రమాదకరంగా మారుతున్నాయని పర్యావరణ వేత్తలు చెబుతుండగా, అవేమి పట్టనట్లుగా జిల్లా కేంద్రంలోని రోడ్ల మధ్య గల డివైడర్లలో, ఖాళీ స్థలాల్లో కోనో కార్పస్ మొక్కలను నాటడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. వేగంగా పెరిగి, పచ్చదనాన్ని సంతరించుకొని ఆకర్షణీయంగా కనిపించే ఈ మొక్కను నాటేందుకే గతంలో అధికారులు మొగ్గు చూపడంతోనే, నేడు వృక్షాలుగా మారాయి. హరితహారంలో భాగంగా మున్సిపల్ అధికారులు రహదారులు, గార్డెనింగ్, కమ్యూనిటీ అవెన్యూ ప్లాంటేషన్లలో పెంచారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో, మంచిర్యాల మున్సిపాలిటీలో వాటిని తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపడుతున్నారు. డివైడర్ల మధ్యలో నాటిన వాటిని మొదళ్ల వరకు నరికేస్తుండగా, కొద్ది రోజులకే మళ్లీ చిగురించే అవకాశం ఉంది. డివైడర్ల మధ్య, ఇతర ప్రాంతాల్లో నాటిన కోనోకార్పస్ మొక్కలను పూర్తిగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇతర మొక్కలు నాటితేనే..

జిల్లా కేంద్రంలోకి ప్రవేశించగానే రోడ్డు మధ్యలోని డివైడర్ల మధ్య కోనోకార్పస్ మొక్కలే దర్శనం ఇస్తుంటాయి. పర్యావరణ సమస్యలకు కారణమవుతున్న కారణంతో హరితహారంలో ఈ మొక్కను నాటకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. గతంలో నాటిన మొక్కలను తొలగించకపోవడం వల్ల అవి ఏపుగా పెరిగాయి. ఈ మొక్కలు పూలు పూయనంత వరకు పెద్దగా ప్రమాదం లేకపోగా, ఒకవేళ పూలు పూస్తే, వాటి ద్వారా గాలిలో ఎక్కువ సంఖ్యలో పుప్పొడి రేణువులు చేరి శ్వాసకోశ సమస్యలు ఉత్పన్నం కావడం, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు పెరగడానికి కారణం ఈ మొక్కలేనని, పర్యావరణానికి ఇవి చేటని పర్యావరణ ప్రేమికుల అభిప్రాయం. ఈ మొక్కపై ఏ పక్షి వాలక పోగా, ఏ జంతువు కూడా ఈ మొక్కలను తినదని, పక్షులు కనీసం గూళ్లు కూడా కట్టుకోవని, వేగంగా పెరిగి నిత్య పచ్చదనంతో ఈ మొక్క ఉండడం వల్ల, ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమించడం, ఇతర స్థానిక జాతి మొక్కలను ఎదగకుండా చేస్తుందన్న ప్రచారం ఉంది. వీటిని తొలగించి, వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటాలని పట్టణ ప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ అధికారులు కోనోకార్పస్ మొక్కలను మొదళ్లకు నరికేస్తుండగా, శాశ్వతంగా తొలగించి, వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటాలని ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతోంది.

ఏపుగా పెరగకుండా చేస్తాం..

మంచిర్యాల పట్టణంలోని రోడ్డు మధ్యలో డివైడర్లలో నాటిన కోనోకార్పస్ మొక్కలు వృక్షాలుగా ఏపుగా పెరిగి పూలను పూస్తున్నాయి. పూల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, వాటిని తొలగించాలని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు, ఆ మొక్కలను మొదళ్లకు నరికేసే పనులు చేపడుతున్నాం. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటడంతో పాటు, కోనోకార్పస్ మొక్కలు ఏపుగా పెరగకుండా వాటిని డిజైన్‌గా ట్రిమ్ చేసి, అవి ఏపుగా పెరగకుండా చేయడంతో పాటు, అందంగా కనిపించేలా తీర్చిదిద్దుతాం.

– మసూద్ అలీ, మున్సిపల్ ఇంజనీర్, మంచిర్యాల

తడిసిన పంటలు కొనుగోలు చేయాలి

నెన్నెల: అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, పత్తి పంటలకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వర్షాలతో నష్టపోయిన నెన్నెల రైతులతో సోమవారం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ మాట్లాడారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని, పత్తిని పరిశీలించారు. ప్రభుత్వం సక్రమంగా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడం వల్ల రైతులు ధాన్యాన్ని కళ్లాల్లో నిల్వ చేసుకొని నష్టపోయారన్నారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, సెంటర్‌లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. పాల్తిన్ కవర్లు ఏ ఒక్క కేంద్రంలో లేవని ఆరోపించారు. ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో లేక ధాన్యం తడిసిందన్నారు. కొందరు రైతుల ధాన్యం నల్లబడి మొలకలు వచ్చాయని, పత్తి నల్లరంగుగా మారిందని వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. రైతాంగానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉండి పోరాడుతుందన్నారు.



తడిసిన పత్తిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

భీమిని: అకాల వర్షానికి తడిసిన వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యాల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. కన్నెపల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బేర రామయ్య యాదవ్, నాయకులు పుల్లూరి రాజయ్య, గోవర్ధన్ ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ



అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న స్వాములు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి మహా మండల పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు కాలనీల నుంచి పెద్దఎత్తున స్వాములు ఈ పూజలకు తరలివచ్చారు. కేరళకు చెందిన తాంత్రికులు సంజీవ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలశ పూజా, దివ్యనెట్టాంబడి పూజ, సామిక అభిషేకం వంటి విశేష పూజలు చేశారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో పూజా ప్రాంగణం మారుమ్రోగింది. పూజ అనంతరం స్వాములు పాప ప్రక్షాళన కోసం అగ్నిగుండ ప్రవేశం గావించారు. కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ శ్రీరాంపూర్ శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరభద్రస్వామి, ప్రధాన కార్యదర్శి రాజేశం, కమిటీకి చెందిన వెంకటేశం, శ్రావణ్, సదానందం, శ్రీనివాస్, లింగయ్య, భరత్ రెడ్డి, శ్రావణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



దండేపల్లి: ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తూ..

దండేపల్లి/కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత ఐదేళ్లుగా పరిష్కారం కాని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దండేపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ప్రసాద్‌కు, కాసిపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు, హాజీపూర్ మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కొండయ్యకు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే అంశంపై తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని, పనికి తగిన గుర్తింపు ఇస్తూ ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఆదేశించాలని కోరారు.

జన జీవన స్రవంతిలో కలవాలి

మందమర్రిరూరల్: మావోయిస్టులు జన జీవన స్రవంతిలోకి రావాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఊరు మందమర్రి గ్రామంలోని మావోయిస్టు బబ్బెర రవి తల్లి, అన్నను కలిసి వారి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులు అందజేశారు. లొంగిపోతే ఆయన పేరిట రూ.ఐదు లక్షల రివార్డు అందిస్తామని తెలిపారు. సీఐ శశిధర్, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై పోరాడేందుకు టీఎన్జీవోస్ యూనియన్ ఉద్యోగులకు అండగా ఉంటుందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. జిల్లాలో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదును సోమవారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టారు.

మున్సిపల్ ఎన్నికలు జరిపించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీకి సుమారు మూడు దశాబ్దాలుగా ఎన్నికలు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదని, వెంటనే ఎన్నికలు జరిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు అందుగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు.

తెలంగాణ టీం కోచ్‌గా రోహిత్

మంచిర్యాలటౌన్: తెలంగాణ స్పోర్ట్స్ యోగా అసోసియేషన్ తరుపున మంచిర్యాలకు చెందిన ఆర్. రోహిత్ తెలంగాణ టీం కోచ్‌గా ఎంపికైనట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అక్కల తిరుపతి వర్మ, సెక్రటరీ మండ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



పాతమంచిర్యాల: కేక్ కట్ చేస్తున్న నాయకులు

దండేపల్లి/రామకృష్ణాపూర్/జన్నారం/పాతమంచిర్యాల/జైపూర్/కాసిపేట//లక్సెట్టిపేట/నెన్నెల/మందమర్రిరూరల్/వేమనపల్లి/మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి(తాండూర్): జిల్లా వ్యాప్తంగా సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

పదోన్నతులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: ఏరియాలో సర్వే విభాగంలోని చైన్‌మెన్, హెడ్ చైన్‌మెన్ పోస్టుల పదోన్నతులకు సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. చైన్‌మెన్‌కు ఎనిమిది మంది, హెడ్ చైన్‌మెన్‌కు నలుగురు హాజరయ్యారు. సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులతో వీటిని భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, చిరంజీవి లు(ఐఈడీ), సర్వే అధికారి వెంకటేశం, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆడిట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: బెల్లంపల్లి రీజియన్ పరిధిలో పనిచేస్తున్న ఇంటర్నల్ ఆడిట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదాలు సోమవారం శ్రీరాంపూర్‌లోని ఆడిట్ కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మిని కలిసి ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు రెస్ట్ రూమ్స్, వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. మంచినీటి సౌకర్యం కూడా సక్రమంగా లేదని వెంటనే కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, ఆడిట్ విభాగం ఫిట్ కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు మల్లేష్, హరి, రమేష్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలి



గనిపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

బెల్లంపల్లి: సింగరేణి బొగ్గుగనుల్లో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి రక్షణలో విధిగా భాగస్వామి కావాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ (జీఎం హెడ్‌ఆర్‌డీ)ఎస్‌డీ హబీబ్ హుస్సెన్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్ అన్నారు. మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై సోమవారం రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా రక్షణ కమిటీ పర్యటించింది. గనిలో చేపడుతున్న రక్షణ చర్యలను కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. రక్షణ కోసం ఉద్యోగులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన రక్షణ పరికరాలు, పనిముట్లు వాడాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలని సూచించారు. అనంతరం మందమర్రి కమ్యూనికేషన్‌సెల్ ఆధ్వర్యంలో సింగరేణి కళాకారులు, ఉద్యోగులు నాటికను ప్రదర్శించారు. కన్వేయర్ బెల్ట్ వద్ద పనిచేస్తున్న క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా రక్షణ అధికారి ఎం.రవీందర్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఏ జీఎం (ఆర్ అండ్ డీ) కనకయ్య, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, డీజీఎం (ఈఅండ్ఎం) రామనాథన్, డీజీఎం (సర్వే) ఆర్‌జీ–2 దేశాయ్, ఎస్ఓ ఎండి .రహమత్ అలీ, ఎస్‌కే గ్రూప్ ఎండి. అబ్దుల్ ఖాదర్, గ్రూప్ ఇంజనీర్ బసవరాజు , శాంతిఖని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా , గని రక్షణ అధికారి రాజు, బీఎం ఇంచార్జీ ముస్తాఫా ,ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరి దాసరి తిరుపతి గౌడ్, ఉద్యోగులు ,కార్మికులు పాల్గొన్నారు.

ఐకే 1ఏ గనిపై రక్షణ పక్షోత్సవాలు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే 1 ఏ గనిపై రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. గనిలో రక్షణ పక్షోత్సవాల ప్రతిజ్ఞ అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో కలిసి చేశారు. ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి మాట్లాడుతూ.. రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ నాగన్న, రక్షణ అధికారి సతీష్, ఫిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సింగరేణి మనుగడకు సహకారం కావాలి

- మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీతో జీఎం సమీక్ష



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: కోలిండియా, ప్రైవేట్ బొగ్గు గనుల్లో నుంచి ఎదురయ్యే పోటీలో తట్టుకొని నిలబడాలంటే సింగరేణి మనుగడకు ఉద్యోగుల సమష్టి సహకారం కావాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ కోరారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ఏరియా స్థాయి మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ ద్వారా గనుల వద్దకు వెళ్లి సంస్థ ఎదుర్కొంటున్న పరిస్థితులు వివరించి అధికారుల, ఉద్యోగుల నుంచి సలహాలతో సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి కమిటీ కృషి చేస్తుందని వివరించారు. సమావేశంలో ఏరియా అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సోలార్ వాటర్ గ్రీజర్ ఏర్పాటు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు వారి తల్లిదండ్రులు సోలార్ వాటర్‌గ్రీజర్ (హీటర్స్)లను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తెలిపారు. పాఠశాలలో 370 మంది విద్యార్థులుండగా, చలికాలం కావడంతో ఇబ్బంది పడుతున్నారని వారి తల్లిదండ్రులు సుమారు రూ. మూడు లక్షల యాభైవేలతో సోలార్ వాటర్ గ్రీజర్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

బెల్లంపల్లి: విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడానికి తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు గణితం ప్రతిభా పోటీలు

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధి ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు గణిత ఫోరం ఆధ్వర్యంలో గణితం ప్రతిభా పోటీలను సోమవారం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఎంఈవో చిన్నయ్య ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

మధునపోచమ్మకు బోనం

వేమనపల్లి: మండల కేంద్రంలోని జాలరివాడలో కొలువై ఉన్న మధునపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం రాత్రి బోనాలు వైభవంగా మొదలయ్యాయి. మండల కేంద్రంతో పాటు కోటపల్లి, దహెగాం, కన్నెపల్లి, నెన్నెల మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్, కాలేజ్‌లో గంటల ప్రాతిపదికన సివిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సార తస్నీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు 12న సాయంత్రం 4గంటల వరకు బయోడేటా, సంబంధిత సర్టిఫికెట్లతో స్కూల్ పనివేళలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కోటపల్లి: మండలంలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్‌సెంటర్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు సంచార ప్రయోగశాలతో ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ప్రయోగాలు, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

బెల్లంపల్లి: ప్రజాపాలన విజయోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను సన్మానించారు. ప్రశంసాపత్రాలు, షీల్డ్స్ అందజేశారు.

ధర్మ యుద్ధానికి సిద్ధం కావాలి

పాతమంచిర్యాల: మాదిగలు ధర్మ యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బుర్ర సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు.

నేటి నుంచి గీతా జయంతి ఉత్సవాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్లో భగవద్గీత అధ్యయన మండలి ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో గీతా జయంతి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకుడు గోనె శ్యాంసుందర్ రావు తెలిపారు. భగవద్గీత జయంతి ఉత్సవాలపై సోమవారం సమావేశం జరిగింది. ఉత్సవాలకు గీతాగాన, ప్రవచన, ప్రచార కర్త భగవద్గీత అధ్యయన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాధర్‌శాస్త్రీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కౌన్సిల్ సభ్యులు

పాతమంచిర్యాల: అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని విజిలెన్స్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ చైర్మన్ రాజలింగు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా విజిలెన్స్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ వి భాగం సోషల్ డిటెక్టివ్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ అధ్యక్షతన స్టాప్ కరప్షన్ పోస్టర్లు ఆవిష్కరించారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

జన్నారం: అడవుల రక్షణ అందరి బాధ్యత అని జన్నారం ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు పేర్కొన్నారు. జన్నారం అటవీ డివిజన్ బాధంపల్లి, పుట్టిగూడ గ్రామాల్లో సోమవారం అటవీ సిబ్బందితో కలిసి అడవులపై అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు.